■ సామర్ల రమేష్



# ఆఖరి కోరిక

యశోదమ్మ ఆఖరి కోరిక విని నోళ్ళెళ్ళబెట్టారు కొడుకు, కోడలు, మనుమళ్ళు.

"డాడీ. నానమ్మ ఆఖరిసారిగా చూడాలనుకొనేది తాతయ్యిచ్చిన ఇంటినా లేక సైకియాట్రిస్టనా!" జోకేశాడు చిన్న మనుమడు వివేక్. అందరూ నవ్వేశారు.

తన ఆఖరి కోరిక తనవాళ్ళకి నవ్వులాటగా ఉండడంతో యశోదమ్మ కళ్ళు చెమ్మగిల్లాయి.

"అమ్మా ఎందుకే ఇలాంటప్పుడు నీకీ కోరిక పుట్టింది. ఇన్నాళ్ళూ నాన్న పేరే ఎత్తనివ్వనిదానివి, ఇప్పుడు ఆయన నీ పేర రాసిన ఇంటిని చూడాలనుకోవడం ఎందుకో నాకర్థం కావడం లేదు. ఇప్పటిదాకా రాక్షసుడిలా కనిపించిన మనిషి ఇప్పుడు దేవుడిలా కనిపిస్తున్నాడా? అయినా, నిన్నంత దూరం ఆ మారుమూల ఊరుకి తీసుకెళ్ళే ఓపికా, తీరికా నాకు లేవు. నేను ఆఫీసు పనిమీద ముంబాయి వెళుతున్నాను. పిచ్చి ఆలోచనలు మాని చివరి రోజులు ప్రశాంతంగా గడుపు. వస్తాను." కొడుకు విశ్వనాథ్ కుండ పగులగొట్టినట్లు చెప్పేసి బయటికి వెళ్ళిపోయాడు.

కోడలు వంటింట్లోకి, మనుమళ్ళు కార్తీక్, వివేక్ కాలేజీలకి వెళ్ళిపోయారు.

యశోదమ్మ, ఆమె భర్త రాజారావు విశ్వనాథ్ పుట్టక ముందే విడిపోయారు. చిన్నప్పుడు విశ్వనాథ్ తండ్రి గురించి మాట్లాడినా ఆమెకి నచ్చేది కాదు. ఆ ప్రసక్తే తేవద్దని కచ్చితంగా చెప్పేది. భర్త గుర్తొస్తేనే రక్తం ఉడికిపోయేది. తండ్రంటే తల్లికి ఎందుకంత ద్వేషమో చిన్నారి విశ్వనాథ్‌కి అర్థమయ్యేది కాదు. కాలక్రమేణా తండ్రి గురించి అడగడం, ఆలోచించడం మానేశాడు.

నీరసంగా మంచంమీద పడుకున్న యశోదమ్మలో బాధ నుడులు తిరుగుతోంది. ఎంత సర్ది చెప్పుకుందామన్నా మనసంగీకరించడం లేదు. అలాగే కళ్ళు మూసుకుంది.

'తానెందుకు భర్తింటిని చూడాలనుకుంటుందో కొడుక్కి చెబితే ఒప్పుకుంటాడేమో...' ఆ ఆలోచన రాగానే మనసు కాస్త తేలికయింది. 'అవును. తప్పకుండా ఒప్పుకుంటాడు... విశ్వం ఊరునుండి రాగానే చెప్పి ఒప్పించాలి.'

యశోదమ్మ కోరిక తీరలేదు. కొడుకుని ఒప్పించలేక కాదు, కొడుక్కి చెప్పలేక. కారణం విశ్వనాథ్ ముంబాయి నుంచి తిరిగొచ్చేలోపే ఆమె మరణించింది.

* * *

న్యూయార్క్...

యు.ఎస్.ఏ...

వృద్ధుడైన విశ్వనాథ్ ఓ ఖరీదయిన హాస్పిటల్‌లో టెస్ట్‌లు చేయించుకుని కూర్చొని ఉన్నాడు. ఇంతలో పెద్ద కొడుకు కార్తీక్ బయటికొచ్చాడు.

విశ్వనాథ్ చెప్పమన్నట్లుగా చూశాడు.

"డాడీ. ట్రీట్‌మెంట్ వల్ల యూజ్ లేదట. సిక్స్ మంత్స్ కంటే బతకడం కష్టమని చెప్పారు." కార్తీక్ ఫీవరొచ్చింది అని చెప్పినంత ఈజీగా చెప్పాడు.

విశ్వనాథ్‌కి బాధ కానీ, భయం కానీ అనిపించలేదు. ఇంకా బతికి సాధించేదేమీ లేదని అర్థమైపోయింది. ప్రస్తుతం చావు గొప్ప రిలీఫ్.

ఆ రాత్రి బెడ్ మీద పడుకున్న విశ్వనాథ్‌కి అప్రయత్నంగా గతం గుర్తుకు రాసాగింది.

తండ్రి లేకుండా పెరగడం, తల్లి, తండ్రిని అమితంగా ద్వేషించడం, కొడుకులిద్దరూ ఇంజనీర్లయి అమెరికా రావడం, రిటైరయిన తర్వాత తానూ, భార్య అమెరికా వచ్చేయడం, భార్య మరణం...

అప్పుడు గుర్తొచ్చింది తల్లి మరణం. తల్లి మరణం... తల్లి ఆఖరి కోరికగా తండ్రి ఇంటిని చూడాలని ఉందని అడగడం... తాను, పిల్లలు తిరస్కరించడం...

ఆలోచనలు అక్కడే, ఆ సంఘటన చుట్టూ తిరగడం మొదలుపెట్టాయి. అప్పటివరకూ లేని బాధ మరు నిమిషంలో మస్తిష్కమంతా వ్యాపించింది. మళ్ళీ మళ్ళీ అదే సన్నివేశం. ప్రతిసారీ బాధ మరింతగా పెరిగిపోతోంది.

బాధతో మెదడు మండిపోకుండా ఉండడానికా అన్నట్లు కళ్ళలోంచి బయటికొచ్చిన కన్నీరు కొద్దిసేపు అక్కడే నిలిచి చల్లదనాన్ని విస్తరించడానికి ప్రయత్నించి ఓడిపోయి జాలిగా కిందకి జారింది.

రోజులు గడుస్తున్నాయి. మృత్యువు సమీపించే కొద్దీ అతనిలో గతం తాలూకు జ్ఞాపకం బడబాగ్నిగా మారి ఆ కొద్దిపాటి ఆయుష్షునీ దహించేస్తోంది.

"గ్రాండ్ పా... దిస్ ఓల్డ్ బుక్ ఈజ్ హియర్. ఈజ్ ఇట్ యువర్స్?" మనుమరాలు మోనికా ఏదో పాత పుస్తకం చేతికిస్తూ అడిగింది.

నాలుగు పేజీలు తిరగేస్తే అర్థమయింది. అది విశ్వనాథ్ తల్లి యశోదమ్మది. తల్లిదని తెలియడంతో ఆనందాదుర్దాలతో పేజీలు తిప్పాడు. డైరీలా అనిపించింది. కానీ, ఒక సంవత్సరానిది కాదు. మొత్తం జీవితానిది. అతని కళ్ళు ఆర్ద్రంగా అక్షరాల వెంట కదిలాయి.

* * *

తలుపు చప్పుడయింది. గుండె దడ పెరిగింది. అప్రయత్నంగా లిప్తపాటు చప్పుడైన వైపు చూసి తల దించేసింది. రాజారావు గడియ పెట్టి ఆమె వైపు కదిలాడు.

అతని అడుగుల చప్పుడు దగ్గరవుతున్నకొద్దీ ఆమె శరీర కంపన ఎక్కువ కాసాగింది. రెండడుగుల దూరంలో ఆగాడు. ఆమె దించిన తల ఎత్తలేదు. కొన్ని క్షణాల విరామం... అతనేమయినా అడుగుతాడేమోనని అనుకుంటుండగా అమాంతంగా కౌగలించుకున్నాడు.

మొదట ఏం జరిగిందో అర్థం కాలేదు. ఆమె శరీరం అతని బిగి కౌగిలిలో నలిగిపోతుండగా నెమ్మదిగా జరుగుతున్నది అర్థం కాసాగింది. ఇంతలో అమాంతంగా ఎత్తి బెడ్ మీద పడేసి ఆమెని చేరుకున్నాడు.

అది యశోద, రాజారావుల మొదటి రాత్రి. ఆమె ఎన్నెన్నో మాటలు, మురిపాలు, సిగ్గులు, మోహమాటాలూ ఊహించుకుంది. కానీ, ఇంతవరకూ మాటమాత్రమైనా అతను మాట్లాడలేదు. మనసుకి సర్ది చెప్పుకుని, అసంతృప్తిని మరిచిపోయి ఆనందించడానికి ఉపక్రమించింది. అతని చేష్టలకి ఆమె శరీరం మెలికలు తిరుగుతోంది.

రాజారావు అకస్మాత్తుగా యశోదని వదలి కొంచెం దూరంగా జరిగాడు. అలా దూరంగా ఎందుకు జరిగాడో అర్థం కాలేదు. కళ్ళు మూసుకునే తన్మయంగా అడిగింది.

"ఏమయిందండీ?"

"పరవాలేదే. నీకు మంచి ఎక్స్‌పీరియన్స్ ఉన్నట్లుంది."

అతడన్నది అర్థం కాగానే షాక్ తగిలినట్లుగా లేచి కూర్చుంది.

రాజారావు యశోద వైపు హేళనగా చూస్తున్నాడు. "ఎంజాయ్ చెయ్యడం బాగా నేర్చుకున్నట్లున్నావ్!"

మాట్లాడ్డం ఆమె వల్ల కాలేదు. కళ్ళ వెంబడి నీళ్ళు కారడం మొదలుపెట్టాయి.

"ఏంటా వెధవేడుపు. ఈ రోజుల్లో ఇలాంటివన్నీ మామూలే కదా. ఫ్రెష్ క్యాండేట్‌లెక్కడ దొరుకుతారు." వెకిలిగా అన్నాడు.

యశోద ఏడుపు మరింత ఎక్కువయింది. "చాల్లే ఆపు." కోపంగా అని మళ్ళీ మీద చెయ్యి వేశాడు.

యశోద బాధకి ఆశ్చర్యం తోడయింది. ఇంత నీచంగా మాట్లాడిన మనిషి మళ్ళీ ఒంటిమీద చెయ్యెలా వెయ్యగలిగాడో అర్థం కాలేదు. ఆమె మనసు స్పందించడం మానేసింది. శరీరాన్ని భర్త అధీనంలో నుంచి తప్పించలేకపోయింది.



చిత్రం: నర్సిం

డాబా మీద నిలబడ్డ యశోద నిర్లిప్తంగా సూర్యాస్తమయాన్ని చూస్తోంది. పెళ్ళికి ముందు ఎంతో ఆనందాన్ని కలిగించిన సంధ్యాసమయం ఇప్పుడేమాత్రం ప్రాముఖ్యం లేని విషయంగా కనిపిస్తోంది. పెళ్ళయిన నెల రోజులకే జీవితం మీద ఆసక్తి చచ్చిపోయింది. మొగుడొక సైకో. శాయశక్తులా అనుమానించి అవమానిస్తున్నాడు. సహనం చచ్చిపోయింది. హృదయం స్పందించడం మానేసింది.

ఇంతలో రాజారావు పైకొచ్చాడు. కోపంతో మొహం జేవురించింది. "ఎవడికి లైనేస్తున్నావే ఇక్కణ్ణుండి." కర్కశంగా వచ్చాయి మాటలు.

సమాధానం లేని ప్రశ్న కావడంతో నిస్తేజంగా, ముభావంగా కిందకి రాబోయింది. మరుక్షణం చెంపలు పేలాయి.

మరో రెండు నెలలు అతి భయంకరంగా గడిచాయి. అప్పుడు సమయం రాత్రి పదకొండు గంటలు. రాజారావు ఇంకా ఇంటికి రాకపోవడంతో అసహనంగా, అతి కష్టంమీద నిద్రనాపుకుంటూ ఎదురు చూస్తోంది. ఎంత రాత్రయినా అతనొచ్చే వరకూ మెలకువగా ఉండాల్సిందే. లేకపోతే శరీరం మీద బెల్ట్ వాతలు పడడం ఖాయం.

కాలింగ్ బెల్ మోగింది. అమాంతంగా, ఆలస్యం చెయ్యకుండా వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా రాజారావు, మరో వ్యక్తి నిలబడి ఉన్నారు. దారికి అడ్డు తప్పుకుంది. వాళ్ళు లోపలికి రాగానే ఆల్కహాల్ వాసన గుప్పుమంది. వంటింట్లోకి నడవబోయింది.

"తినే వచ్చాం." రాజారావు మాటలు ముద్దగా వచ్చాయి. అక్కడ నిలబడలేక బెడ్ రూమ్‌లోకెళ్ళి మంచంమీద వాలిపోయింది.

> **మనం ఒకరి ఆఖరి కోరిక తీర్చడానికి తిరస్కరిస్తే ఆ తిరస్కారమే మన ఆఖరి రోజుల్లో తీరని కోరికగా మారి చిత్రవధ చేస్తుంది.**

రాజారావు లోపలికొచ్చాడు. లేచి కూర్చుంది. అప్పుడు చూసింది రాజారావుతోపాటు లోపలి కొచ్చిన ఆ మరో వ్యక్తిని. గబాల్న లేచి నిలబడింది. అపరిచిత వ్యక్తిని అక్కడ చూడడంతో బయటికి వెళ్ళబోయింది.

రాజారావు అమాంతంగా యశోద చెయ్యి పట్టుకుని అన్నాడు. "ఇదిగో ఈయన మా జి.ఎం నీలకంఠం. నాకు డబుల్ ప్రమోషన్ రావాలంటే ఈ రాత్రి నువ్వు ఈయన్ని సుఖపెట్టాలి. ఎధవ పతివ్రత ఏషాలెయ్యకుండా స్వర్గాన్ని చూపించు. అర్థమయిందా?" యశోదని నీలకంఠం దగ్గరికి నెట్టి తూలుకుంటూ బయటికెళ్ళిపోయాడు.

నీలకంఠం తలుపు ముయ్యకుండానే ఆత్రంగా యశోదని కౌగలించుకున్నాడు.

అంతే...

మరుక్షణం అతని నోటి నుండి "అమ్... మ్మా..." అనే కేక ప్రతిధ్వనించింది. రెండు చేతులూ రెండు కాళ్ళ మధ్యకి చేరాయి. అప్పటిదాకా కోరికతో ఉరకలెత్తిన నీలకంఠం అప్పుడు ప్రాణభయంతో భీతిల్లాడు. ఆ కేక విని రాజారావు లోపలికి పరుగెత్తుకొచ్చాడు. అతనికీ అదే శాస్తి జరిగింది.

మరుక్షణం యశోద కట్టుబట్టలతో బయటి కొచ్చేసింది. పుట్టింటికి వెళ్ళలేదు. వాళ్ళు ఆదరించే అవకాశం లేదు. హైదరాబాద్‌లో ఉంటున్న స్నేహితురాలు సుమతి ఇంటికి వెళ్ళింది. అక్కడి కెళ్ళిన రెండు రోజులకి పిడుగు లాంటి వార్త తెలిసింది. 'యశోద తల్లి కాబోతోంది.' సుమతి, ఆమె భర్త నిరంజన్ అబార్షన్ చేయించుకోమన్నారు. కానీ, యశోద అంగీకరించలేదు. వాళ్ళూ బలవంత పెట్టలేదు. మరో పది రోజుల్లో నిరంజన్ తనకి తెలిసిన ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం ఇప్పించాడు. యశోద వేరే ఇంటికి మారింది.

యశోద మగ బిడ్డని ప్రసవించింది. మరో సంవత్సరం గడిచింది. ఒకరోజు రాజారావు స్నేహితుడు భాస్కర్ ఆమె దగ్గరకొచ్చాడు. రాజారావు క్యాన్సర్‌తో అవసాన దశలో ఉన్నాడని, యశోదని చూడాలని, క్షమించమని అడగాలని అనుకుంటున్నాడని, అదే అతని ఆఖరి కోరికని చెప్పాడు.

యశోద చలించలేదు. రానని కచ్చితంగా చెప్పేసింది. భాస్కర్ మళ్ళీ మళ్ళీ వచ్చి బతిమలాడాడు. యశోద ససేమిరా అంది. సుమతి భర్త నిరంజన్ కూడా రాజారావు ఆఖరి కోరికని తిరస్కరించవద్దని, తిరస్కరిస్తే తన చివరి రోజుల్లో పశ్చాత్తాపపడాల్సి వస్తుందని నచ్చచెప్ప బోయాడు. ఎవరెన్ని చెప్పినా ఆమె మనసు కరగలేదు. రాజారావు మీద ద్వేషం తగ్గలేదు. రాజారావు అతని ఇంటినీ, కొద్దిపాటి ఆస్తినీ యశోద పేరుమీద రాసి మరణించాడు.

* * *

తల్లి గతం తెలిసిన విశ్వనాథ్ చలించిపోయాడు. ఇంతలో ఆ పుస్తకంలో నుండి ఒక కాగితం కింద పడింది. అది మెడికల్ బిల్. దాని వెనుక ఏదో తెలుగులో రాసి ఉంది. అది తల్లి చేతిరాత. ఆత్రంగా చదివాడు.

'నాకు ఆఖరి రోజులు దగ్గర పడుతున్నాయని తెలిసినదగ్గర్నుంచి, నిరంజన్ అన్నట్లుగా అంతులేని పశ్చాత్తాపం మొదలయింది. మనం ఒకరి ఆఖరి కోరిక తీర్చడానికి తిరస్కరిస్తే ఆ తిరస్కారమే మన ఆఖరి రోజుల్లో తీరని కోరికగా మారి చిత్రవధ చేస్తుందని అర్థమయింది. నా భర్త నా పేర రాసిన ఇంటిదగ్గరకెళ్ళి క్షమాపణ వేడుకొంటే గానీ ఈ బాధ తగ్గేలా లేదు. నా కొడుక్కి నా ఆఖరి కోరిక చెబితే విసుక్కున్నాడు. మనుమళ్ళు నవ్వుకున్నారు. అసలు కారణం ఎలా చెప్పాలో అర్థంకాక ఊరుకున్నాను. కానీ, ఈ బాధ భరించడం నావల్ల కావడం లేదు. విశ్వం ఊరునించి వచ్చిన తర్వాత అసలు విషయం వాడికి చెప్పి ఒప్పిస్తాను. అప్పటికీ వాడు ఒప్పుకోకపోతే... నా ఆఖరి కోరిక తీరకుండానే నేను మరణిస్తే... నా కొడుకు వాడి చివరి రోజుల్లో నాలాగే పశ్చాత్తాపపడడం ఖాయం.'

తల్లి డైరీని గుండెలకి హత్తుకుని ఏడుస్తున్నా విశ్వనాథ్‌ని చూసి మనుమరాలు మోనికా ఆశ్చర్య పోయింది. "గ్రాండ్ ఫాకి ఇండియన్ సెంటిమెంట్స్ ఇంకా వదిలినట్లు లేవు." మనసులో అనుకుంది.

తల్లి ఆఖరి కోరిక తీర్చని విశ్వనాథ్‌కి అదే ఆఖరి కోరికగా మారిందన్న విషయం అర్థం చేసుకునే శక్తి ఆమెకి లేదు. ■